# మాయింట్లో పిల్లి

("మారుతి" - సాహితీసమితి)

పిల్లులకీ యితర జంతులకీ తెలివితేటలు లేవనీ, ప్రపంచంలో వున్న తెలివితేటలన్నీ మనిషిలోనే మూర్తీభవించినవనీ, చెప్పేవాళ్లకీ నాకూ స్నేహం లేదు. అలాగని చెప్పి అన్ని జంతువులతోటీ నేను నేస్తంకట్టను. ఆమాట కొస్తే కుక్కకీ నాకూ పరమశత్రుత్వము. కారణము—కుక్కకూ ఇంగ్లీషువాడికీ పరమస్నేహం కాబట్టి.

పిల్లిమీద నాకు ఒకమోస్తరు కోపం. అయినప్పటికీ దానిమీద అభిమానం లేక పోలేదు. ఏమంటారా మా మేనత్త—ఆవిడకు నేనంటే చాలా మమకారం. నేను వాళ్లింటి కెప్పుడు వెళ్లినా చాలా ఆదరించి, వచ్చావా నాయనా అని, నాకు జంతికలుచేసి పెట్టుతుంది కాబట్టి—ఒకపిల్లిని పెంచుతుంది. అన్నట్టు చెప్పడం మరిచిపోయాను; మా మేనత్త వితంతువు. వితంతువులకీ పిల్లులకీ ఒకమోస్తరు సంబంధం వుండివుండాలి; ఈ జన్మంలో కాకపోయినా పూర్వజన్మంలో నైనాను. లేకపోతే, వారిద్దరికీ యింతటి మక్కువ ఎందుచేతనో నాకు బోధపడడంలేదు. నా అదృష్టమేమో కాని—దురదృష్టం అనండి. మాయిష్టం—నేను ఎందరోవితంతువులను చూచాను. ప్రతీ వితంతువూ ఒకపిల్లిని—తెల్లపిల్లీ, గండుపిల్లీ, నల్లపిల్లీ, పొడలపిల్లీ, పిల్లికళ్లపిల్లీ, ఇంగ్లీషు పడుచుల్లాగ నీలికళ్లపిల్లీ—ఏదో ఒక పిల్లిని పెంచడమే చూచాను. వెనకటికి ఎవరో ఒక యిల్లాలు వుండేదిట, మా మేనత్త చెప్పేది. ఆవిడకు పెంచుతూన్నపిల్లంటే ప్రాణం. వారానికొకమాటు దానికి నూనెరాసి కుంకుడుకాయ పులుసుతో రుద్ది తల నీళ్లుపోసేదిట! చెవ్వులో నూనెకూడా పోసేదిట! మధ్యాహ్నం వంట చేసుకొని, తా నింత తిని పిల్లి కింతపెట్టి, వీధి అరుగుమీద కూచుని, చేటలో పెసరపప్పు ఎండలో బెట్టి, పిల్లిని ఒళ్లో కూచోబెట్టుకొని, కాకుల్ని కొట్టుతూ, గులివితెడ్డుతో గులివి తీసేదిట! ఎంత మమకారమో! అయితే స్వేచ్ఛ కోరి, యిష్టానుసారం తిరిగి, మనుష్యులను లక్ష్యపెట్టని, పిల్లి యిన్ని విధాలుగా యిబ్బంది పెట్టుతూఉంటే ఎలాగ వూరుకుందో అనుకుంటాను. కాని యీపిల్లి సామాన్యపు పిల్లి కాకపోవచ్చును. పూర్వజన్మంలో, బహుశా యీ వితంతువుకు దగ్గరబంధువని మాత్రము నానిశ్చితాభిప్రాయం. ఎలకలని పట్టి చంపడానికని పిల్లిని పెంచుతారుగాని, వాస్తవానికి పిల్లి ఎలకలని పట్టదని నా నమ్మకం. తినడానికి తగినంత వున్నట్లయితే, ఏపిల్లీ ఏ ఎలకజోలికీ వెళ్లదని నేను నమ్ముతాను. యదార్థానికి పిల్లు

లున్నచోటే ఎలకలు ఎక్కువగా వుంటాయి. కడుపునిండిన పిల్లిదగ్గర ఎలకలు తైతక్కలాడతాయి.

ఈసంగతి ఒక దేశపు గవర్నమెంటువారు బాగా గ్రహించినట్లు తోస్తుంది. ఆ మధ్య ఖర్చు తగ్గించడానికి ప్రయత్నాలు చేస్తూ తక్కువ ఉద్యోగస్థుల జీతాలూ స్కూలు మేష్టర్ల జీతాలూ తగ్గించారు. ఆరీతిగానే పిల్లుల కిచ్చేభత్యంకూడా తగ్గించినట్లు తెలియవస్తోంది. ఏదో వూళ్లో ఏదో ఆఫీసులో ఎలకలు విస్తారముగా వున్నాయిట. ఆ ఎలకల బాధ పడలేక, ఆఫీసులో ఒకపిల్లికి ఉద్యోగం యిచ్చారట! ఆపిల్లి యథావిధిగా తన విహితధర్మము నిర్వహిస్తూ, దొరతనమువారు వేతనరూపకముగా యిచ్చే భృత్యము ననుభవిస్తూ, లోకముతో సంతృప్తి జెంది వుండేదట. ఆ మధ్య జీతములు తగ్గిస్తూ పిల్లి భృత్యమును ఆ దొరతనము తీసివేసినారు. తీసివేస్తూ అన్నారట, "ఎలకలను తిని పిల్లికి వేరే ఆహారంకోసం భృత్యమెందుకు? భృత్యంతో ఆహారము కొనివేస్తే అది మళ్లీ ఎలకలను ముట్టదు కాబట్టి, ఎలకలను ముట్టనిపిల్లి ఆఫీసు కెందుకు?" అని. ఆమాట నిజము. ఇందులో ఇంకో విశేషం వుంది. జీతములు తగ్గుటచే, బాధపడుచున్నవాళ్లము, స్కూలు మేష్టర్లము, మేమొక్కరమే అని వాళ్లు విలపిస్తూంటే, వాళ్లకు సహవాసంగా పిల్లికూడా దొరికింది. ఈ మార్జాలసహవాసమును స్కూలుమేష్టర్లకు కల్పించినందుకు, ఆ తెగవారందరూ ఆ గవర్నమెంటు బుద్ధివైభవమునకు సంతోషిస్తూ, వారియెడల కృతజ్ఞత కలిగి వుంటారని నేను దృఢముగా నమ్ముచున్నాను. ఇట్లా వున్నట్లయితే వారికి కుక్క మున్నగు యితరజంతువుల సహవాసముకూడ అచిరకాలములోనే సమకూరగలదని నమ్ముచున్నాను. మామేనత్తమీద నాకు మక్కువ. ఆ కారణంచేత ఆవిడిపిల్లిమీద నాకు అభిమానం. ఎంత అభిమానం వున్నా రాత్రి భోంచేసి, పరుపు వేసుకొని పండుకొని, మంచి నవల చదువుకుంటూన్నప్పుడు, సద్దులేకుండా వచ్చి భ్రష్టుపిల్లి—వెధవపిల్లి — పక్కను పడుకొని, గుర్రుమంటూంటే, ఎవళ్లకి ఒళ్లుమండుకుపోదు—వితంతువులకు తప్ప. ఆసంగతి అలా వుండగా శుబ్భరంగా అరటాకు వేసుకొని, యిష్టమైన పదార్థాలు ఆప్యాయంగా తినే సమయాన్ని, ఎదురుగుండా కూచుని ఈపిల్లి రెప్పవెయ్యకుండా చూస్తూ, నీవు తినే అన్నంముద్దలు లెక్కపెట్టుతూంటే, ఒళ్లు మండుకుపోతుందా పోదా? ఏమంటారా,—మనం హిందువులము కాబట్టి, దృష్టిదోషం అంటే నమ్మకం యింకా పోలేదు. పచ్చకళ్లతో యీ పిల్లి యీ విధంగా చూస్తూంటే, దృష్టిదోషం తగలదని ఎలాగ అనుకోగలము? అన్నం అరగక అజీర్ణరోగము రాదని ఎలాగ అనుకోగలము? ఆ సమయంలో, పక్కనున్న నీళ్ల చెంబు తీసుకొని మొహంబద్దలగొట్టవలె నని బుద్ధి పుట్టకపోదు. నీళ్ల చెంబంటే జ్ఞాపకం వచ్చింది. పిల్లి అంటే నాకు కోపానికి ఒక కారణం వుంది. తల్లితండ్రుల గుణాలు కొన్ని గాకపోయినా కొన్నైనా పిల్లలకు వస్తాయని చెప్పుతారు.

పిల్లిని చూచి అసహ్యించుకోవడం అనేగుణం నాకు మా అమ్మనుంచి వచ్చింది. మా అమ్మ చాలా ఆచారమంతురాలు. కడిగిందే కడుగుతూ, తోమిందే తోముతూ, స్నానాల మీద స్నానాలుచేస్తూ మాకు సాధారణంగా మూడోఝామునగాని భోజనం పెట్టేదికాదు. ఆవిడకూ పిల్లికీ బద్ధవైరం. ఆవిడున్నచోట పిల్లి వుండదు. పిల్లి వున్నచోట ఆవిడ—పిల్లిని వుండనియ్యదు. ఎంచేతనంటే?

పిల్లికి ఆచారం తెలియదు. ఎప్పుడేనా స్నానం చేస్తుందో లేదో మనకు తెలియదు. మనం ఎరిగినంతమట్టుకు చూస్తూన్నంతమట్టుకు దానికి స్నానం లేదు. తరువాత అది అన్నం తిని మూతి కడుక్కోదు. మా అమ్మకు దాని మీద కోపానికి యిదే ప్రధానకారణం. విస్తళ్లలో మిగిలిన అన్నం మెతుకులు రెండు తిని యీ పిల్లి యింట్లోవున్న వస్తువులన్నీ ముట్టుకుంటుంది. మా అమ్మగానీ దానిని ఆ సందర్భంలో చూచినట్లయితే, దాని నుద్దేశించి ఒక చిన్నవుపన్యాసం చేసేది,—"ఎక్కడ దాపరించిందమ్మా యీ వెధవపిల్లి? నూరుకళ్లతో చూస్తూన్నా, ఎక్కడా వుండేమార్గం అగుపడదు. ఎక్కడకని, నేను చూడగలను? పోనీ, దాన్ని పట్టుకొని సంచీలో పెట్టి ఎక్కడేనా వదలిపెట్టేరమ్మంటే చెవినిబెట్టరు. (యిది మొగాళ్లను ఉద్దేశించి). ఇది పూర్వజన్మంలో, నాకు సవితికాబోలు. లేకపోతే యిలా వేపుకు తింటుందా? ఎంతమట్టుకని చూస్తూ వూరుకోను? మెతుకులన్నీ పొట్టవిచ్చేలాగ తిని ఆ అంటమూతితో యింట్లో కూరలబుట్ట ముట్టుకుంది. దాన్నంతా యిప్పుడు కడుక్కోవాలి. ఆ అంటమూతితో ఊరగాయల కుండ ముట్టుకుంటే ఇంకేమేనా వుందా?" ఇత్యాదిగా గబగబ ఒక ఉపన్యాసం యిచ్చి చెంబెడు నీళ్లు తరుముకువెళ్లి దాని నెత్తిమీద పోసీ దావిడ—చచ్చి స్వర్గాన్నంది. అంటమూతిపిల్లికి, ఆ చెంబెడు నీళ్లతోనూ శుద్ధి అయ్యేది. ఒక్కొక్క గండుపిల్లి తప్పించుకుపోయేది కూడాను. ఆ సందర్భంలో మా అమ్మకు కోపమూ దుఃఖమూ ఇంతా అంతా కాదు. ఎంచేతనంటే—ఈ వెధవపిల్లి ఊరూరూ ఇల్లిల్లూ తిరిగి, అందరి ఎంగిళ్లూ కలిపివేసి, ఆఎంగిలి మాయింటికి మళ్లీ తీసుకు వస్తుందని. మా అమ్మ అప్పుడప్పుడు పిల్లిని పట్టుకోడానికి ప్రయత్నించేదికూడాను. ఖర్మంచాలక ఏదేనా ఒక పిల్లి దొరకినట్లయితే దాన్ని బిందెలో వేసి, బిందెనిండా బట్టలు వేసి, నీళ్లకు వెళ్లేటప్పుడు కాలవకు తీసుకు వెళ్లేది. అక్కడ ఆ పిల్లిని వదలిపెట్టి, రెండుదాన్ని తిట్టి, బట్టలు వుతుక్కొని, స్నానంచేసి, మడినీళ్ల బిందెతో యింటికి వచ్చేది. ఇంట్లోకి వచ్చి, నీళ్లబిందె దింపి ""విరగడైందమ్మా వెధవపిల్లి" అనేది. అనీ అనడంతోనే మ్యావని ఆపిల్లే గదులో పెట్టి మీదనుంచి దిగి ప్రత్యక్షమయ్యేది.

ఏలాగైతేనేమి నాకు పిల్లిమీద కోపానికి మా అమ్మే కారణం. ఇంక మా పిల్లి సంగతి. మా అమ్మ బతికివున్నన్నాళ్లూ మా యింట్లో పిల్లి కాలుపెట్టలేదు. దరిమిలాని ఒక పిల్లి—పాపము చాలాలు—మా యింటికివచ్చి యిల్లంతా శోదా చూచి వెళ్లింది. కొన్నాళ్లు

పోయాక, ఒక తెల్లపిల్లిపిల్లని మా యింటి దగ్గిర వప్పగించింది. దాన్ని పూర్వపు అలవాటును బట్టి తరిమివెయ్యడానికి ప్రయత్నం చేశాము. ఎంతచేసినా, మాయిల్లు మాత్రం అది వదిలీదికాదు. ఇల్లంతా కర్ర తీసుకు తరిమి, ఇంట్లోంచి వెళ్లిపోయిం దని అనుకుంటూంటే, ఏబుట్టలోంచో, ఏపొయ్యి పెడలోంచో, ఏ అలమారు లోంచో మ్యావు అనేది. దాన్ని తరిమీమార్గం దొరక్క, పోనీ మా అమ్మ లేదుగదా పిల్లి వుంటే ఏమి పోయిందని వూరుకున్నాం. ఊరుకోవడానికి యింకోకారణంకూడా వుంది. మా చంటమ్మాయికీ, యీపిల్లిపిల్లకీ, ఒకవిధమైన స్నేహం కుదిరింది. మా అమ్మాయిదగ్గిరకు వెళ్లి తోక లాగినా, చెవులు పీకినా, ఊరుకునేది ఈపిల్లి. మేమెవరమేనా దగ్గిరకు వెళ్లితే మాత్రం పారిపోయీది. కొత్తలో మా అమ్మాయి, పిల్లిని వింతగా చూచీది కాని దగ్గిరకువెళ్లేది కాదు. రానురాను దానిదగ్గిరగా వెళ్లి దానితో ఆడుకొనీది ఒక ఆటబొమ్మతో ఆడుకొన్నట్లు. అంటే జ్ఞాపకంవచ్చింది. ఒకనాడు ఒక ఇల్లాలు చంటిపిల్లను చంకబెట్టుకొని, చుట్టపు చూపుకు వచ్చింది మాయింటికి. చంటిపిల్లను నడవలో వదలి, ఆవిడ మాఅమ్మాయితల్లితో గుమ్మంముందర కూచుని కబుర్లు చెప్పుతోంది. మా అమ్మాయి చంటిపిల్లను చూచి దగ్గిరగా వెళ్లింది.

ఇద్దరూ కొంచెం ఎడంగా కూచుని ఒకరినొకరు పరకాయించి కొంతసేపు చూచుకున్నారు. ఒకరి నొకరు కొంతసేపైనతరువాత తాకినారు. తరువాత ఒకరినొకరు లాగిచూచుకున్నారు. చివరకు ఒకరినొకరు ఒకబొమ్మగా నిశ్చయంచేసుకున్నారు. చేసుకుని ఒకరిజుట్టు ఒకళ్లు పట్టుకుని లాగుకోవడం ప్రారంభించారు.

"ఊఁ"

"ఊఁ"

"ఊఁ ఊఁ"

"ఊఁ ఊఁ"

తరువాత రోదనాలధ్వని విని ఇద్దరు పిల్లలనీ, తల్లులు విడిపించారు. ఆచంటిపిల్లలాగ యీపిల్లిపిల్ల, మాఅమ్మాయితో కలియబడి దెబ్బలాడలేదు, అందుచేత ఆపిల్లిపిల్ల దగ్గిర మాఅమ్మాయికి చనువు.

ఈ పిల్లిపిల్లను యింట్లో వుంచడానికి ఇంకోకారణంకూడా కద్దు. మా అబ్బాయికి కూడా ఈపిల్లిపిల్లంటే ఎంతో సరదా పిల్లిపిల్లకు మాత్రం మావాడంటే అతిభయం. పిల్లిపిల్ల నెమ్మదిగా ఒకమూల కూచుని, హాయిగా కళ్లుమూసుకొని, ప్రపంచాన్ని మరిచిపోతూన్న సమయంలో, మావాడు నెమ్మదిగా దానివెనకాలే వెళ్లి తోక లాగుతాడు. అది ఏమి జరిగిందో గ్రహించలేక దిక్కుతోచకుండా పరుగెత్తుతుంది. మావాడు గంతువేసి నవ్వుతాడు. ఒక్కొక్కప్పుడు పిల్లిపిల్లని కర్ర పుచ్చుకొని యిల్లంతా తరుముతాడు కూడాను. మావాడికి పిల్లిమీద ఎంత అభిమానం అంటే—

ఒకనాడు "ఒరే అబ్బాయీ, వంటింట్లో ఎవరూలేరు. పిల్లివచ్చి ఏమేనా ముట్టుకోగలదు చూస్తూండు" అన్నాను.

కొంతసేపు వంటింట్లో కూచోనిఉండి తరవాత మావాడు వచ్చి "నాన్నా, నాన్నా, పెద్దపిల్లా చిన్నపిల్లా" అన్నాడు. చిన్నపిల్లి అంటే వాడి కంత ప్రేమ.

ఒకనాడు మావాడు పిల్లిపిల్లతో ఆడుకుంటున్నాడు. మేము చూసీ చూడకుండా ఊరుకున్నాము. కొంత సేపటికి మావాడు మాదగ్గిరకు వచ్చి నవ్వడం మొదలు పెట్టేడు. మాకు అర్థమయిందికాదు. "ఎందుకురా నవ్వుతా"వంటే మాట్లాడడు. అప్పుడు అక్కడ వారెవరో "పిల్లేదిరా" అన్నారు. మావాడు గట్టిగా నవ్వి "నూతులోపడ వేశాను" అన్నాడు. ఎక్కడ పిల్లిబ్రమ్మత్య వస్తుందో అని దాన్ని కష్టపడి పయికి తీశాము. తీసినందుకు విశ్వాసమేనా చూపకుండా, అది పారిపోయింది. మావాడు చేసినపని చెడ్డపని అని యిది చదివేవాళ్లందరూ అనుకుంటున్నారని నాకు అనుమానంగా వుంది. మావాడి మనస్సులో వున్నవూహాలే వాళ్లందరకూ వుంటే, మావాడికి వున్న ఉత్సాహము, జంతువుమీద ప్రేమా, చదువు సంధ్యలు మాని పిల్లిపిల్లలతోటీ కుక్కపిల్లలతోటీ ఆడుకుందామనే ఆసక్తీ వాళ్లందరకూ ఉన్నట్లయితే, మావాడికివలెనే వారందరూకూడా ప్రత్యేకంగా ఒకపిల్లిపిల్లను సంపాదించి నూతులోపడ వేస్తారనేనానమ్మకం. అల్లా పడవెయ్యకపోయినట్లయితే, అధమపక్షం ఆలాగ పడవెయ్యడానికి యిచ్ఛయేనా లేకున్నట్లయితే వారిమెడ నాకు గల సదభిప్రాయము మార్చుకోవలసి వస్తుం దని వినయపూర్వకంగా మనవిచేస్తున్నాను.

ఎన్నికారణాలువున్నా ఈపిల్లి యింట్లో వుండడం నాకు మట్టుకు చాలా అయిష్టంగా వుంది. ఏమంటే, తెల్లవారగానే కళ్లు నులుపుకొని, శ్రీరాములుని తలుచుకొని, కళ్లు తెరిచేటప్పటికి—ఎదూరుగా సిద్ధం యీపిల్లి. ఏదైనా తొందరపనిమీద వెళ్లవలె నని గడప దాటి గుమ్మాలు దిగుతూవుంటే— ఎదూరుగా సిద్ధం యీపాడుపిల్లి. నేనిలాగంటే యిదంతా మూఢవిశ్వాసం అంటారు దొరలు. ఆమాటకు వస్తే దొరలకిమాత్రం లేవా మూఢవిశ్వాసాలు? "దీనిమొహం ఈడ్చా, తెల్లారకుండా వచ్చి నా మొహంఎదట పడింది, ఈపాడుపిల్లి" అని మనం అఘోరిస్తే, వాళ్లు—అంటే ఇంగ్లీషు దొరలు—తెల్లారీటప్పటికి నల్లపిల్లిగానే కళ్ల ముందర పడ్డట్లయితే ఆవేళ ఏదోచక్రవర్తిత్వం వచ్చినట్లు సంతోషిస్తారు.

ఇదిమాత్రం మూఢవిశ్వాసం కాదూ? వట్టిగడ్డిబండి ఎదురుపడ్డట్లయితే తక్షణం కళ్లు మూసుకొని, ఒకకోరిక కోరుకొని, బండి పోయేదాకా కళ్లు తెరవకుండా వున్నట్లయితే ఆకోరిక తప్పకుండా సిద్ధిస్తుం దని వాళ్ల నమ్మకం—బండిమాత్రం కళ్లు మూసుకున్నప్పుడు మీదనుంచి పోకుండా వుంటే సరి.

గుండుసూది దొరికితే లాభం ఆరోజున. కత్తెర విడదీసివున్నది చూస్తే ఆరోజున కలహం. ఎవరేనా తుమ్మినప్పుడు మనము 'చిరంజీవ' అన్నట్లే, వాళ్లు "భగవంతుడు నిన్ను రక్షించుగాక," అంటారు. సోమవారం తుమ్మితే అపాయం. మంగళవారం తుమ్మితే కొత్తవాళ్లవుపిస్తారు. బుధవారం వుత్తరం

వస్తుంది. గురువారం మంచిది. శుక్రవారపు తుమ్ము దుఃఖావహము. శనివారపుతుమ్ము వలన మరునాడు ప్రేయసి లభ్యమవుతుంది. లేవకముందు ఆదివారం తుమ్మినట్లయితే భోజనానికి ముందే సీమనోహారిణి దర్శనమవ్వుతుంది. ఇవి వాళ్లకొన్ని నమ్మకాలు. వాళ్లమాటెందుకు మనకు? ఇంక మనపిల్లి సంగతి.

చిన్నతనంలో మా అమ్మ జోలలుపాడేటప్పుడు నాకు పిల్లిమీద గొప్ప అభిప్రాయం వుండేది. ఆ అభిప్రాయానికి కారణము పిల్లి యొక్క గొప్పతనమో పాట గొప్పతనమో నేను నిర్ణయించలేకపోతున్నాను. ఆపాటలు యిక్కడ వ్రాస్తాను. మీరు నిర్ణయించగలరేమో చూచుకోండి.

౧. ఉళళ......హాయీ
హాయివారమ్మాయి నీళ్ల కెళ్లింది,
పాలైన యివ్వవా ఓ కుక్కపిల్లా?
ఉళళ......పిల్లీ
పిల్లమ్మ వెళ్లింది పల్లెల్లు దాటి,
అబ్బాయి వెళ్లేడు రచ్చల్లు దాటి.

౨. ఉళళ......పిల్లీ
పిల్లిరావే తల్లి పిల్లల మర్రి,
మర్రికిందా వాడు తొర్రి నాగన్న!
తొర్రినాగన్నకూ తోడెవ్వరమ్మా?
గుర్రాలు కాసేటి గురవడే తోడు.

3. పిల్లి వారింటికే చల్ల కెడితేను,
అల్లవారికుక్క భౌంయి మన్నాది;
నా కాళ్ల గజ్జెలు ఘల్లు మన్నాయి;
నాచంకలో బిడ్డ కేరు మన్నాడు.

౪. హాయి హాయీ హాయి ఆపదలుకాయి
చిన్నవాళ్లను కాయి శ్రీవెంకటేశా
పిల్లమ్మ కన్నుల్లు బీర పువ్వుల్లూ,
అబ్బాయి కన్నుల్లు కలవ రేకుల్లూ;
చిన్నారి పొన్నారి చిరుతవే నీకు,
చిగురుమామిడికింద చిన్నకోవిలవు; హా.

నిర్ణయించలేకపోయినా యీ గొప్పతనం పాటదీ కాదు. పిల్లిదీకాదు- మాఅమ్మదని నాదృఢాభిప్రాయం.

పిల్లిమీద అభిమానం వున్నా, లేకపోయినా, మాయింట్లో పిల్లికి మాత్రం నేను అన్నం తినేటప్పుడు ఒక్కమెతుకైనా విదపలేదు. మాకుర్రాడుమాత్రం కొంచెం అన్నం పెట్టేవాడు. నేను చూచి వూరుకునేవాణ్ణి. ఒకనాడు ఎంచేతనో కోపం వచ్చి, ఒకమెతుకేనా యింట్లో దొరకనిచ్చేను కాను. ఏలాగైనా రెండుమెతుకులు పొట్టలో వేసుకోవాలని పిల్లి ప్రయత్నించిందిగాని లాభంలేకపోయింది. అది వెళ్లిపోయి కొంతసేపటికి వాళ్లమ్మను తీసుకువచ్చింది. వాళ్లమ్మతో పిల్లు అన్నం పెట్టడంలేదని ఫిర్యాదు చేసింది కాబోలు. అది సంగతిసందర్భాలు కనుక్కుందామని వచ్చి వుంటుంది. వాళ్లమ్మతో ఫిర్యాదు చెయ్యడం యిది మొదటిపర్యాయం కాదు. వాళ్లమ్మ మా యింట్లో దాన్ని ప్రవేశపెట్టిన కొత్త ప్రియాన్ని పిల్లిపిల్ల మా పశువుచుట్టలమీద పండుకునేది. వాళ్లమ్మ మా యిల్లు అంతా శోదాచూచి, యిక్కడ పండుకుంటూవుండు, యిప్పుడిప్పుడు యీయీ వస్తువులు తింటూ వుండు, అని నీతిబోధలు చేసి వెళ్లిపోయింది.

ఆ రీతిగా అది పండుకుంటూ వుండేది. ఒక నాడు నేను పరుపు తీసుకోవలసివచ్చి పరుపు చుట్టమీద చెయ్యివేతును గదా వెచ్చగా మెత్తగా ఏమిటో తగిలింది. ఇదేమిటి చెప్మా అని, దీపంతీసుకువచ్చి చూసేసరికి యీ వెధవ పిల్లి ముడిచిపెట్టుకు పండుకుంది. చాలా కోపం వచ్చింది నాకు. కర్ర చేత్తో పుచ్చుకు తరమడం మొదలుపెట్టేను. హోరున వాన కురుస్తోంది బయట. ఎలాగైతే నేమి యింట్లోంచి వానలోకి కొట్టేశాను. మరునాడు తగవుతీర్చడానికి వాళ్లమ్మ వచ్చింది పిల్లను వెంటబెట్టుకుని. రెండుపిల్లులూ యిల్లంతా చూచుకున్నాయి. వాళ్లమ్మ వెళ్లిపోయింది.

ఇంకోమారు ఏమి జరిగిందంటే.—

సాయంకాలం అవడంతోటే పాలవాడు చిన్న చెంబుతో పాలిచ్చి వెళ్లిపోయాడు. ఆ



చెంబుతోనే పాలుకాచి అవి భోజనానంతరం తాగి మేమంతా విశ్రమిస్తున్నాము. ఇంతట్లోకే ఏమూలనుంచో పిల్లిపిల్ల వచ్చి చెంబును సమీపించింది. అంచులు, ప్రక్కలూ జాగ్రత్తగా నాకింది. ఒక కాలు చెంబుమీద పెట్టి లోపలచూచి నెమ్మదిగా తలదూర్చి, లోపల కూడా నాకడం ప్రారంభించింది. పూర్తిగా నాకివేసిన తరవాత తలతీసుకోవడానికి తల యెత్తింది. తలతోకూడా చెంబు లేచింది. చెంబు నేలను కొట్టింది. మళ్లీ తలయెత్తింది. చెంబు మళ్లీ లేచింది. పిల్లికి గాభరాపుట్టింది. రంయి రంయి మని చెంబు నేలను కొట్టుతూ యిల్లంతా పరుగెత్తడం ప్రారంభించింది పిల్లి. మా అమ్మాయి కేరుమని ఏడవడం ప్రారంభించింది. మా అబ్బాయీ, తల్లీ మంచంమీద కెక్కి నిలబడ్డారు. ఫుమ్మరాపులవంటి మొగా

ళ్లము మేమిద్దరం దానివెనక పరుగు దొరకించుకున్నాం. మాకు దొరికితేనా అది. అది ముందూ మేం వెనకాను. "తలుపులేనా తీసేయ్యండి బయటికి పోతుందేమో" అంది, నా భార్య. "చెంబుమాటేమిటి"? అన్నాను నేను. "పిల్లి బ్రహ్మహత్య వస్తుందేమో"! అంది నా భార్య. టక్కు టక్కున నేలమీద చెంబు కొట్టుతూ ముందరకు వెనక్కు, పక్కలకి, ఎగరడం, దూకడం, గెంతడం —— ఇల్లంతా అల్లకల్లోలం వైంది. పట్టుకుని తీసేద్దామంటే మాకుదొరకడం లేదు. ఏమిసాధనం? "అయ్యో అయ్యో! లాంతరు దీపం పడగొట్టింది. చెంబు దాన్నేసికొడుతోంది. చూస్తూ వూరుకుంటారేం"? వూరుకోక ఏమిటిచేసేది?

వెనకటికి ఒకయిల్లాలు యింట్లోకి తేలు వస్తే "చూస్తూ వూరుకుంటారేమిటి? మొగాళ్లనేనా పిలుచుకురాకూడదా" అందిట భర్తతో! "నాన్నా, నాన్నా, నాపలకనేసి కొడుతోంది చెంబు" అన్నాడు మావాడు. మాఅమ్మాయి ఏడుపు విడవడం లేదు. పిల్లికి గాభరా ఎక్కువై పోతోంది. దానిమనస్సులో ఏమేమి వూహాలు పరుగువారుతున్నాయో గ్రహించడం కష్టం. మగవాళ్లం మేమిద్దరమూ పంచకట్టు బిగుంచుకున్నాం. రెండు వేపులా కాసేము.

"పట్టుకో"

"పట్టుకో"

మమ్మల్ని తప్పించుకొని చెంబుముఖంతో పిల్లి నడవలోకి వెళ్లింది. మేము నడవలోకివెళ్లేము. "ఈమాటుఅలాకాదోయి, జంబుకానా తీసుకురా" అన్నాను.

జంబుకానా తీసుకు వచ్చి రెండువేపులాయిద్దరమూ పట్టుకొని దానిమీదఒకమారు కప్పినాము. పిల్లికి కొత్తగాభరా పుట్టింది. చెంబు తీవ్రంగా నేలను పెట్టికొట్టుతోంది. గోళ్లన్నిబయటకు తీసి బరుకుతోంది.

జంబుకానామీద చేతులువేసి దానిని అదిమిపట్టినాను నేను. మావాడు నెమ్మదిగా జంబుకానాఎత్తుతూ-చెంబు ఒక్కమారు లాగినాడు. చెంబు జారిపోయింది.మళ్లీ చెంబు నెమ్మదిగా పట్టుకుని చుట్టూరా తిప్పి లాగినాడు. లాగి చెంబుతో కూడా ఒక్కమాటు మంచం ఎక్కేడు. పిల్లి ఒక్కగంతు వేసి పారిపోయింది. పోయి తల్లితో ఫిర్యాదు చేసింది.

మరునాడు తల్లీ పిల్లా మళ్లీవచ్చారు. మావల్ల ఏమితప్పు లేదుకదా, అని తల్లి గ్రహించింది కాబోలు, మమ్మల్ని ఏమీ అడగకుండా యిటూ అటూ తిరిగి పోయింది. పోయి పిల్లిపిల్లకు నీతి వుపదేశంచేసివుంటుంది.

"అన్నం లేదని వాళ్లమీద ఫిర్యాదు చేసే బదులు—ఎలకపిల్లల్ని పట్టుకుపోరాదా" అనీ —"పరుపుచుట్టమీద పండుకో నియ్యకపోతే వెచ్చగా వుంటుంది పొయ్యిపెడలో పడుకోకూడదా, యీమాత్రందానికి నాతో ఫిర్యాదు చెయ్యాలా, ఎప్పటికప్పుడు యిలాగ నేను నీతులు చెప్పుతూవుంటేనే ప్రపంచంలో నెగ్గలేకుండావున్నావు. నేను లేకపోతే ఏమి చేద్దువో"అనీ—"వెధవసంత వచ్చింది ఎంతవరకని సర్దుకురా"ననీ ఏమోమో అనివుంటుంది. బహుశా మమ్మల్నందరినీ అదితిట్టిందేమోఅని కూడా నా అనుమానం. చెంబువిషయంలో

ఏమి నీతి నుపదేశించిందో తెలియలేదు. ఎంచేతనంటే మరునాటినుంచీ యథాప్రకారం పాల చెంబు నాకడం అది ప్రారంభించింది కాని దాని తలమాత్రం మళ్లీ చెంబులో చిక్కుకోలేదు.

ఇంతకే, యింతఅనుభవమైన తరువాత మళ్లీ, నీతివున్న పిల్లైతే, మాయింటికి రాదనుకున్నాను. ఈ పిల్లివిషయమై నాకు మంచి అభిప్రాయంపోయింది. నీతిలేకపోయాక ఇంకబతకడం ఎందుకు? చెంబుగొడవ తలచుకొని మాయింటికి యీపిల్లి రాదుగదా, అనుకుంటూంటే నాకు ఆశాభంగమైంది. పిల్లి మళ్లీ యింటికిరాకుండా చెయ్యడానికి ఒకవుపాయం వుందని నాస్నేహితుడొకడు నాతోరహస్యంగా చెప్పినాడు. జాగ్రత్తగాపిల్లిని పట్టుకొని దానిని ఒకకుండలో పెట్టవలెనట. ఆకుండమూతి కట్టివెయ్యవలెను. తరవాత జాగ్రత్తగా ఆకుండను యింటికప్పుమీదకు తీసుకవెళ్లవలెను. ఆ కుండను ఆ కప్పుమీదనుంచి దొర్లించవలెను. కుండదొల్లిదొర్లి ఒక్కమారు రంయిమని కిందబడి ధమ్ముమని పగులుతుంది. పిల్లి మళ్లీయింటికిరాదు. ఈవుపాయం చాలామంచి దని నాకుతోచింది. ఏమంటారా?—మొదట చీకటి కుండలో కదలలేక మెదలలేక కూచోవడం—తరవాత కుండదొర్లుతూన్నప్పుడు, భూకంపం వచ్చి భూమి అల్లల్లాడిపోతున్నట్లు గొడవా, ధ్వని, గిర్రుగిర్రున కుండలో పిల్లిమంత్రాలూ,—తరవాత గాలిలోంచి పడడం—అలాగ పడేటప్పుడు, శబ్దమూ, దొర్లడంఆగి, ఒక్కమారు శ్శబ్దంగా, అప్రయత్నంగా, ఎక్కడకోపాతాళలోకానికి పోతూన్నట్లుండడమూ— తరవాత పిడుగు పడ్డట్లు ధామ్మని శబ్దమూ, — కుండ పెంకులూ, చీకటిలోంచి ఒక్కమారువెల్తురూ —ఈఅనుభవాలన్నిటివల్లా పిల్లికి మతిపోయి తీరుతుంది. మళ్లీ ఎప్పుడు మీాయింట్లో అది కాలుపెట్టదు.

ఈ సలహాప్రకారం చెయ్యవలె నని నేను తీవ్రంగా ఆలోచిస్తున్నాను. కాని ఏనాటికానాడు, మాయింట్లోపిల్లి పెద్దదై, మమ్మల్నందరినీ నిర్లక్ష్యభావంతో చూడడమున్నూ పట్టుకోబోతే తిరగబడికరవబోవడమున్నూ చేస్తూవుండడంవల్ల దానిని పట్టుకోవడం మాత్రం చాలాకష్టంగావుంది. పిల్లికి విశ్వాసం లేదు మొత్తంమీాద. పుట్టినప్పటినుంచి మాయింట్లో అన్నం తిని బతుకుతూ, మా యింట్లో ఎలకలను తిని పెరుగుతూ, మేము పట్టుకోవాలంటే దొరక్క పోవడంకన్న అవిశ్వాస మేమిటి?

కుక్కపిల్ల అలాగ కాదు. ఎప్పుడు పట్టుకోవాలంటే అప్పుడు దొరుకుతుంది పాపము. ఈ ప్రయోగం కుక్కపిల్ల విషయంలో చేద్దును కాని—కుక్కలనుచూస్తే నాకు కోపమని చెప్పనే చెప్పేను మొదట.

(భారతి - మాసపత్రిక - ఫిబ్రవరి, 1924)